# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

సోమవారం 14-8-2023


తెలంగాణలో అధికారం కోసం భారతీయ జనతా పార్టీ తహతహలాడుతుంటే.. అంతర్గత కుమ్ములాటలు ఆందోళనకరంగా మారుతున్నాయి. పార్టీలో అసంతృప్తి జ్వాలలు పెరుగుతున్నాయి. చాలా మంది నేతల పార్టీని వీడుతున్నారు. మరికొందరు వీడే ఆలోచనలో ఉన్నారు. తాజాగా సీనియర్ నేత విజయశాంతి కూడా పార్టీ వీడతారని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది.



# రాములమ్మ ఏమైందమ్మా..

## పార్టీని వీడనున్నట్లు ప్రచారం

ప్రాధాన్యం ఇవ్వడం లేదని అసంతృప్తి

కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారంలోనే వెలుగులోకి

మౌనం వహిస్తున్న విజయశాంతి

**హైదరాబాద్, ఆగస్ట్14 (తెలుగుప్రభ)**

బీజేపీ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారంలోనే ఆమె వేదికను వదిలివెళ్లిపోయారు. అయితే.. అనంతరం అందుకు గల కారణాలను తెలియజేస్తూ ట్వీట్ చేశారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నిర్వహించిన ధర్నాల్లో విజయశాంతి ఎక్కడా పాల్గొనలేదు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమారెడ్డితో వేదికను పంచుకోలేకనే కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయానని ప్రకటించారు. వాస్తవానికి ఇలాంటి ప్రకటనలు చేసినప్పుడు తప్ప బీజేపీలో విజయశాంతి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. మునుగోడు ఎన్నికల సమయంలో బీజేపీ తన సేవలను వినియోగించుకోవడం లేదంటూ విజయశాంతి మీడియా ముందే వాపోయింది. ఇటీవల మరోనటి జయసుధ బీజేపీలో చేరారు. ఆ సమయంలో కూడా విజయశాంతి ఎక్కడా కనిపించ లేదు.

### గుర్తింపు లేదా?

తనకు పార్టీలో కీలక బాధ్యతలు ఎందుకు అప్పగించడంలేదో బండినే అడగాలంటూ గతంలో ఓసారి మీడియా ముందు ఆవేదన వెళ్లగక్కారు. దీంతో చాలా రోజులుగా ఆమె సోషల్ మీడియా పోస్టులకే పరిమితమయ్యారు. సినీనటిగా, ఒకప్పుడు సొంతంగా పార్టీని స్థాపించిన నేతగా, సీనియర్ నాయకురాలిగా పలుకుబడి ఉన్న తనను బీజేపీ నాయకత్వం పట్టించుకోకపోవడంపై 'రాములమ్మ' తీవ్రంగా కలత చెందుతున్నట్లు సన్నిహితులు చెప్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే అనేకమంది నేతలకు టికెట్లపై హామీలు ఇచ్చారని, మరికొందరికి కీలక బాధ్యతలు అప్పగించారని, తనను మాత్రం విస్మరించారని ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది.



రేపు ప్రయాణం చేసే వారికి

## బంపర్ ఆఫర్స్

**హైదరాబాద్, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ ఆయా టిక్కెట్లపై రాయితీలు ప్రకటించింది. మంగళవారం ఒక్క రోజు మాత్రమే ఈ ఆఫర్లు అమల్లో ఉంటాయి. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్లు దాటిన వారికి బస్సు టిక్కెట్ ధరలో సగం చెల్లిస్తే సరిపోతుంది. వయసు ధ్రువీకరణకు మాత్రం ఆధార్‌ను చూపాల్సి ఉంటుంది. నగరంలో 24 గంటల అపరిమిత ప్రయాణానికి సంబంధించిన టీ–24 టిక్కెట్ పెద్దలకు రూ.75లకు, పిల్లలకు రూ.50 లకే లభిస్తుంది. ప్రయాణికులు ఈ రాయితీలను వినియోగించుకొని స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా నగరంలోని తమకు నచ్చిన ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ వీసీ సజ్జనార్‌లు కోరారు. ఇతరత్రా వివరాలకు ఆర్టీసీ కాల్‌సెంటర్లు 040–69440000, 040–23450033 నెంబర్లలో సంప్రదించవచ్చు. మరోవైపు మెట్రోకూడా రూ.59తో అన్‌లిమిటెడ్ జర్నీ అందిస్తోంది.

### హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో గోల్కొండ పరిసరాల్లో ఆంక్షలు విధించారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం రాణిమహల్ లాన్స్ నుంచి గోల్కొండ కోట వరకూ ఉన్న రోడ్డు మూసివేశారు.**

మిషన్ ఎల్-1

## ఇస్రో మరో చరిత్ర

**బెంగుళూరు, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

చంద్రుడి అధ్యయనం కోసం చంద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో చేపట్టిన విషయం తెలిసిందే. దానిలో భాగంగానే ఇటీవలే చంద్రయాన్–3 స్పేస్‌క్రాఫ్ట్‌ను కూడా ప్రయోగించింది. ప్రస్తుతం ఆ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి కక్ష్యలో ఉంది. ఇక ఇప్పుడు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ .. మరో చరిత్రకు శ్రీకారం చుడుతోంది. త్వరలో సూర్యుడి అధ్యయనం కోసం ఆదిత్య ఎల్–1 మిషన్‌ను చేపట్టనున్నది. అయితే ఆదిత్య ఎల్–1 మిషన్‌కు చెందిన ఫోటోలను ఇస్రో అప్‌డేట్ చేసింది. బెంగుళూరులో తయారైన ఆ శాటిలైట్ ఇప్పుడు శ్రీహరికోటకు చేరుకున్నది. తొట్టతొలి సారి సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ఇస్రో సమాయాత్తమైంది. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో ఆదిత్య ఎల్–1ను ప్రయోగించే అవకాశాలు ఉన్నాయి.

### ఆదిత్య ఎల్–1 ఏం చేస్తుందంటే..

ఈ మిషన్‌లో భాగంగా కేవలం సూర్యుడిపైనే ఫోకస్ పెట్టనున్నారు. సౌర తుఫాన్ల సమయంలో జరిగే మార్పులపై స్టడీ చేయనున్నది. ఆ శాటిలైట్ సుమారు 1500 కేజీల బరువు ఉంటుంది. ఏపీలోని శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించనున్నారు. సూర్యుడి–భూమి వ్యవస్థలో ఉన్న ఓ కక్ష్యలో ఆ శాటిలైట్‌ను ప్రవేశపెడుతారు. భూమి నుంచి దాదాపు 1.5 మిలియన్ల కిలోమీటర్ల దూరంలో ఆ కక్ష్య ఉంటుంది. సోలార్ వ్యవస్థను అధ్యయనం చేయడంలో ఆ శాటిలైట్ ఉపయోగపడనున్నది. ఫోటోస్పియర్, క్రోమోస్పియర్‌ను స్టడీ చేసేందుకు ఏడు పేలోడ్స్‌తో ఆ స్పేస్‌క్రాఫ్ట్ వెళ్తుంది. సూర్యుడి ఉపరితలాన్ని కూడా స్టడీ చేయనున్నారు.

## బాలుడిపై వీధి కుక్క దాడి..

**నిజామాబాద్, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

నిజామాబాద్ జిల్లాలో ఓ వీధి కుక్క బాలుడిపై దాడికి యత్నించింది. అందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. జిల్లా కేంద్రంలో 8వ డివిజన్‌లో ఓ బాలుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. కిరాణా షాపుకు వెళ్లి ఏదో తినే పదార్థాన్ని కొనుగోలు చేసిన బాలుడు దాన్ని చేతిలో పట్టుకొని ఇంటికి వెళ్తున్నాడు. అంతలో అతడికి ఎదురుగా వచ్చిన ఓ వీధి కుక్క బాలుడిపై దాడికి తెగబడింది. చిన్నారి చేతిలో ఉన్న తినే పదార్థాన్ని లాక్కునేందుకు ప్రయత్నించింది. బాలుడు గట్టిగా అరవటంతో పక్కనే ఉన్న ఓ ఇంట్లో నుంచి వ్యక్తి బయటకు వచ్చాడు. దీంతో వీధి కుక్క బాలుడి చేతిలో ఉన్న పదార్థాన్ని లాక్కొని అక్కడి నుంచి పరుగులు తీసింది. అయితే చిన్నారికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరిపీల్చున్నారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురువుతున్నారు. ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకోకండి

## నీట్‌ను రద్దు చేస్తాం..

**చెన్నై, ఆగస్ట్14(తెలుగుప్రభ):**

తమిళనాడులో చెన్నైకి చెందిన నీట్ అభ్యర్థి జగదీశ్వరన్ .. శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో అటెంప్ట్‌లోనూ ర్యాంక్ రాకపోవడంతో అతను బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే ఆ కడుపు కోత భరించలేక ఆ మరుసటి రోజే ఆయన తండ్రి సెల్వశేఖర్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. 2022లో జగదీశ్వరన్ 427 మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. కానీ నీట్ వైద్య పరీక్షను అతను క్లియర్ చేయలేకపోడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ విద్యార్థి తన ప్రాణాలను వదిలేసుకున్నాడు.ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం స్టాలిన్ నీట్ అభ్యర్థులను ఉద్దేశించి తాజాగా మాట్లాడారు. ఎటువంటి ఆత్మహత్య ఆలోచనలకు వెళ్లరాదన్నారు. పరీక్షల్ని ఆత్మస్థయిర్యంతో ఎదుర్కోవాలన్నారు. కొన్ని నెలల్లో రాజకీయా సమీకరణలు మారనున్నాయని, ఆ తర్వాత నీట్ పరీక్షను రద్దు చేయనున్నట్లు ఆయన చెప్పారు. నీట్ పరీక్ష విధానాన్ని వ్యతిరేకంగా యాంటీ నీట్ బిల్లును తమిళనాడు రూపొందించింది. అయితే ఆ బిల్లుపై తాను సంతకం చేయబోనని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్న విషయం తెలిసిందే.

## గృహ'లక్ష్మి' మంజూరు షురూ..

**హైదరాబాద్, ఆగస్ట్14(తెలుగుప్రభ):**




ఇళ్లు లేని నిరుపేదల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షలు అందివ్వాలని ఇటీవల నిర్ణయించింది. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 17 లక్షలకు పైగా అప్లికేషన్స్ వచ్చినట్లు తెలిసింది. ఇదిలాఉండగానే లబ్ధిదారులకు పంపిణీ కూడా మొదలైపోతోంది. ఇక ఈ పథకం కింద ఓ చేనేత కార్మికురాలు తొలి లబ్ధిదారుగా ఎంపికైంది. ఆగస్టు 8న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్ యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. పలు కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చుక్క పావని అనే చేనేత మహిళ మంత్రిని కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు. తన భర్త దివ్యాంగుడని.. సొంత ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నామని ఆమె తన బాధను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్.. పావనికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు తాజాగా స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ సమక్షంలో పథకానికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాన్ని పావని కుటుంబానికి అందజేశారు. రాష్ట్రంలో మొట్టమొదటి గృహాలక్ష్మి పథకం లబ్ధిదారుగా చేనేత కార్మికురాలికి అందజేయటం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు.


## చక చకా అభివృద్ధి

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

**కామారెడ్డి, చెన్నై, ఆగస్ట్14(తెలుగుప్రభ):**



రాష్ట్రంలోని అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చకచకా జరుగుతున్నాయి. మరికొద్ది నెలల్లో ఎన్నికలు ఉండే అవకాశం ఉండడం, నోటిఫికేషన్ వెలువడ నుండడం నేపథ్యంలో అంతకు ముందే పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఆ పనుల్లో మంత్రి కేటీఆర్ బిజీబిజీగా ఉన్నారు. తాజాగా కామారెడ్డి జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్నారు. బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన జిల్లా స్వాగత తోరణాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీంతోపాటు 6 లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎల్లారెడ్డికి చేరుకోనున్నారు. అక్కడ పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. మొత్తంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో రూ.53 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డి రోడ్డుపై ఉన్న జీవధాన్ సమీపంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు.



## శ్రీశైలంలో ఎలుగుబంటి హల్‌చల్

**శ్రీశైలం, ఆగస్ట్14 (తెలుగుప్రభ)**

శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న శిఖరేశ్వర ఆలయం వద్ద నిన్న రాత్రి ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. శిఖరేశ్వరం గోపురం వద్ద ఉన్న తిరగలి నంది వద్దకు చేరుకున్న ఎలుగుబంటి... భక్తులు వేసిన కొబ్బరి చిప్పలు ప్రసాదాలు తినేందుకు నిత్యం మూడు రోజులుగా అక్కడకు వస్తున్నట్లు గుర్తించారు. అయితే ఎలుగుబంటి అర్ధరాత్రి ఎవ్వరు లేని సమయంలో ఆలయ పరిసరాల్లో తిరుగుతూ.. డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి కనిపించింది. తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఎలుగుబంట్లు తరచూ శిఖరేశ్వర ఆలయం వద్ద పరిసరాల్లో నిత్యం తిరుగుతూ ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడం వల్లే ఎలుగుబంట్లు అక్కడకు ఆహారం కోసం సంచరిస్తున్నాయని ఎన్ని నివారణ చర్యలు తీసుకున్న వెలుగుబంట్లు అటవీ ప్రాంతం దగ్గర ఉండడంతో నివారించలేకపోతున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.